తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 69 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ శనివారం 12 -10-2024 వెల: 5/రూ -

పాఠకులకు పాత్రికేయ మిత్రులకు, శ్రేయోభిలాషులకు, రిపోర్టర్లకు దసర **శుభాకాంక్షలు.**

**సెలవు**

దసర సందర్భంగా శనివారం మన కార్యాలయానికి సెలవు. కావున ఆదివారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం

ఎడిటర్ : బక్క రవీందర్

# కేసీఆర్ కట్టింది గడీలు..
# మేం కట్టేది బడులు

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలను ఒకే గొడుగు కిందికి తెస్తున్నాం**

**కుల రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి**

**కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన**

**గత పదేళ్లలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శ**



రంగారెడ్డి జిల్లా: 'గత ముఖ్యమంత్రి గడీలు, పార్టీ ఆఫీసులు కడితే.. మేము పేద పిల్లల కోసం సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మిస్తున్నాం. తెలంగాణలోని 28 నియోజకవర్గాల్లో వీటిని కడుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలను ఒకే గొడుగు కిందికి తీసుకురావడం ద్వారా కుల రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యం..'అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 25 ఎకరాల్లో, రూ.125 కోట్ల అంచనా వ్యయంతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గులో అత్యాధునిక హంగులతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.



# స్లీపర్ వందేభారత్ జిగేల్..!

**ఆధునిక సౌకర్యాలు**

**అత్యాధునిక వసతులు**

**దివ్యాంగుల కోసం ప్రత్యేక బెర్త్‌లు**

హైదరాబాద్: భారతీయ రైల్వే గతిని మార్చిన 'వందేభారత్'సిరీస్‌లో స్లీపర్ బెర్తులుతో కూడిన రైలు త్వరలో పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. పరిమిత దూరంలో ఉన్న నగరాల మధ్య 160 కి.మీ. గరిష్ట వేగంతో దూసుకుపోతున్న వందేభారత్ రైళ్లు.. ఇక వేయి కిలోమీటర్లను మించిన దూరంలో ఉన్న ప్రాంతాల మధ్య తిరిగేందుకు సిద్ధమయ్యాయి. ఇందుకుగాను తొలిసారి స్లీపర్ బెర్తులతో కూడిన వందేభారత్ రైలు పూర్తిస్థాయిలో సిద్ధమై తొలి పరుగుకు సన్నద్ధమైంది.

2లో



# 13 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్

**టార్గెట్ 50 లక్షలు..ఇప్పటి వరకు అయ్యింది 20 లక్షల సభ్యత్వాలే**

**సభ్యత్వ నమోదుపై సమీక్షించినకేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్: సభ్యత్వ నమోదుపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. వాస్తవానికి ఈ నెల 15వ తేదీతో రాష్ట్రస్థాయిలో సభ్యత్వ నమోదు ముగించాల్సి ఉంది. సభ్యత్వ నమోదు టార్గెట్ 50 లక్షలు కాగా, శుక్రవారం నాటికి రాష్ట్రంలో 20 లక్షల మంది (5 లక్షల దాకా మిస్డ్‌కాల్‌తో నమోదు, అసంపూర్తి వివరాలు) పార్టీ సభ్యులుగా చేరినట్టుగా బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ సభ్యుల్లో 15 లక్షల మంది పూర్తి వివరాలు నమోదు చేయగా, మిగతా వారికి సంబంధించి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించాల్సి ఉన్నట్టుగా తేలింది. దీంతో దసరా పండుగ తర్వాతి మూడురోజులు 'స్పెషల్ డ్రైవ్'పేరుతో సభ్యత్వ నమోదు ఉధృతంగా చేపట్టాలని బీజేపీ ముఖ్యనేతలు నిర్ణయించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా రాష్ట్రంలోని 36 వేల పోలింగ్ బూత్‌లలో ఒక్కోదాంట్లో కనీసం వంద మంది సభ్యులను చేర్పించడం ద్వారా మరో పది లక్షలకు చేరే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

2లో

# సొంతూళ్లకు నగర ప్రజల ప్రయాణం

2లో



**రద్దీగా మారిన రహదారులు**

**ఖాళీ అవుతున్న రాజధాని నగరం**

**దొంగల కదలికలపై పోలీసుల దృష్టి**

హైదరాబాద్: రాష్ట్రంలో అతిపెద్ద పండుగ అయిన దసరాకు ప్రజలు సొంతూళ్లకు వెళ్తున్నారు. పండుగకు బంధువులు, స్నేహితులను కలుసుకోవడానికి అవకాశం ఉండటంతో కుటుంబంతో కలిసి ఇంటిబాట పట్టారు. ఆర్టీసీ బస్సులు, సొంత, ప్రైవేటు వాహనాల్లో పట్నం వాసులు పల్లెబాట పట్టడంతో హైదరాబాద్ ఖాళీ అవుతున్నది. దసరా పండగ వేళ.. భాగ్యనగరం నిర్మానుష్యంగా మారింది. పండగ కోసం నగర ప్రజలు స్వస్థలాలకు వెళ్లారు. దీంతో నగరంలోని రహదారులన్నీ బోసిపోయాయి.



2లో

# తమిళనాడులో రైలు ప్రమాదం

**గూడ్స్‌ను ఢీ కొన్న మైసూర్-దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్**

**రెండు బోగీల్లో మంటలు**

# కాకినాడ డీఎఫ్‌వోపై పవన్ సీరియస్

**తన పేరు, పేషీ పేరు వాడారని ఫిర్యాదులు**

**విచారణకు ఆదేశించిన డిప్యూటీ సీఎం**

అమరావతి: కాకినాడ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో) డి.రవీంద్రనాథ్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం, అటవీ మంత్రి పవన్‌కల్యాణ్ విచారణకు ఆదేశించారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా నుంచి కాకినాడకు బదిలీపై వచ్చిన రవీంద్రనాథ్‌రెడ్డి.. పవన్‌తో తనకు సన్నిహిత సంబంధాలున్నట్లు చెప్పుకొంటున్నారని..



2లో

# దీపావళిలోపు కార్పొరేషన్ పదవులు

**టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చిట్‌చాట్**

**దసరాకు చేద్దామనుకున్నా ఆ రెండు రాష్ట్రాల ఎన్నికలతో సాధ్యం కాలేదు**

**త్వరలోనే మంత్రివర్గ విస్తరణతోపాటు టీపీసీసీకి కొత్త కార్యవర్గం**

**వ్యాఖ్యల ఉపసంహరణతోనే కొండా సురేఖ వివాదం ముగిసిపోయింది**

**చాలామంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారు**

**స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి పోటీ చేసే అవకాశం**

హైదరాబాద్: దీపావళిలోపు రెండోదఫా కార్పొరేషన్ పదవులు ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. దసరాలోపు చేద్దామని అనుకున్నా హరియాణా, కశ్మీర్ రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా సాధ్యం కాలేదని, ఏఐసీసీ నాయకత్వం కూడా



## దీపావళిలోపు కార్పొరేషన్ పదవులు

(మొదటి పేజీ తరువాయి)

బిజీగా ఉండడంతో మంత్రివర్గ విస్తరణ విషయంలోనూ, టీపీసీసీ కొత్త కార్యవర్గం ఏర్పాటులోనూ జాప్యం జరిగిందన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... ఎంఐఎంతో స్నేహం వేరు. శాంతిభద్రతల సమస్య వేరు. నాంపల్లి నియోజకవర్గంలో మా పార్టీ నేత ఫిరోజ్‌ఖాన్‌పై జరిగిన దాడిని సీరియస్‌గా తీసుకుంటాం. విషయం సీఎం దృష్టికి వెళ్లింది. దాడుల విషయంలో కఠినంగా ఉంటాం. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నియోజకవర్గాల్లో కొంత ఇబ్బంది అవుతోంది. అందుకే చేరికలకు తాత్కాలికంగా బ్రేక్ వేశాం. కానీ బీఆర్ఎస్‌కు చెందిన చాలామంది మాతో టచ్‌లో ఉన్నారు. త్వరలోనే మళ్లీ చేరికలు ప్రారంభమవుతాయి. ఎమ్మెల్యేలు కూడా వస్తారు. సినీనటుడు నాగార్జున కుటుంబాన్ని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ కావాలని మాట్లాడలేదు. కేటీఆర్ వ్యవహారశైలి కారణంగానే అలా మాట్లాడారని అనుకుంటున్నా. అయినా అలా మాట్లాడాల్సింది కాదు. నాగార్జున కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఏం చెబుతుందో చూడాలి. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తారన్న ప్రచారంలో వాస్తవం లేదు. ఈ విషయంలో అధిష్టానం మమ్మల్ని ఎలాంటి వివరణ అడగలేదు. అయినా కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు చెప్పారు. ఆ రోజే ఆ విషయం క్లోజ్ అయ్యింది.

## తమిళనాడులో రైలు ప్రమాదం



(మొదటి పేజీ తరువాయి)

చెన్నై: చెన్నై వైపు వస్తున్న మైసూరు-దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ తిరువళ్లూరు జిల్లా కవరపేట స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బోగీలు పాక్షికంగా అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం 15 బోగీలు పట్టాలు తప్పాయి. రైలు వేగం తక్కువగా ఉండడంతో అదృష్టవశాత్తు ప్రాణనష్టం సంభవించలేదు. అయితే, ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్ నుంచి చెన్నై శివారులోని అరక్కోణం, పెరంబూరు, గుమ్మిడిపూండి మార్గం మీదుగా బిహార్ వైపు ప్రయాణించే దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరింది. ఈ రైలు రాత్రి 8.30 గంటల సమయంలో పొన్నేరి రైల్వేస్టేషన్ దాటి గుమ్మిడిపూండి సమీపంలోని కవరపేట వద్ద భారీ కుదుపులకు లోనై లూప్ లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్‌ను ఢీకొంది. ప్రమాదం జరిగిన క్షణాలలో మంటలు వ్యాపించడంతో కలకలం రేగింది. మొత్తం 13 బోగీలు పట్టాలు తప్పడంతో ఒక్కసారిగా ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ప్రమాదం జరిగిన పరిసరాలు చిమ్మచీకటిగా ఉండడంతో రైలు ప్రయాణికులకు తీవ్ర ఆందోళనతో భీతావహులయ్యారు. ప్రమాద సమాచారంతో గుమ్మిడిపూండి ఎమ్మెల్యే గోవిందరాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి ప్రజలతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. తిరువళ్లూరు కలెక్టర్ ప్రభుశంకర్,ఎస్పీ శ్రీనివాస పెరుమాల్, రైల్వే పోలీసు ఉన్నతాధికారి ఈశ్వరన్ నేతృత్వంలో బృందం సహాయక చర్యలకు పూనుకుంది. అప్పటికే గ్రామస్తులు రైలు బోగీలలో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. అరక్కోణం నుంచి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా కట్టడి చేశారు. జిప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చెన్నైకు తరలించారు. మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు.

## కాకినాడ డీఎఫ్‌వోపై పవన్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

మైనింగ్, అటవీ శాఖ రేంజర్లతో సమావేశాలు పెట్టి, మైనింగ్ వాహనాలు బయటకు వెళ్లడానికి వీల్లేదని, తాను చెప్పినప్పుడే పంపాలని హుకుం జారీ చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎటువంటి ఇబ్బంది ఉన్నా.. తాను చూసుకుంటానని, డిప్యూటీ సీఎం పేషీతో, అవసరమైతే పవన్‌తో స్వయంగా మాట్లాడతానని చెప్పారంటూ ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయాలు తన దృష్టికి రావడంతో పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రవీంద్రనాథ్‌రెడ్డిపై వెంటనే విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తన పేరు, తన కార్యాలయం పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని పవన్ హెచ్చరించారు.

## 13 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 15 తర్వాత వంద మంది సభ్యులను చేర్పించిన వారితో క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేస్తారు. క్రియాశీల సభ్యులుగా ఉన్నవారే పార్టీ బూత్, మండల, జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకునే అవకాశం ఉంటుంది. నవంబర్ 15 నాటికి 'యాక్టివ్ మెంబర్‌షిప్'పూర్తయ్యాక, ఆ తర్వాత బూత్ కమిటీల ఎన్నిక, ఆపై మండల అధ్యక్షులు, మళ్లీ వారు జిల్లా అధ్యక్షులను, ఆ తర్వాత వారంతా రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులకు 77 లక్షల మంది ఓటు వేయగా, ఈ ఓట్లలో 75 శాతం అంటే 50 లక్షల దాకానైనా సభ్యులుగా చేర్పించేలా ప్రయత్నించాలని బీజేపీ హైకమాండ్ టార్గెట్ పెట్టింది. సభ్యత్వ నమోదు జరుగుతున్న తీరుపై శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ సభ్యత్వ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, రాష్ట్రపార్టీ సభ్యత్వ కార్యక్రమ కన్వీనర్ ఎన్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## స్లీపర్ వందేభారత్ జిగేల్..!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు మన రైళ్లలో కనిపించని ఆధునిక రూపుతో ఇవి కళ్లు చెమర్చేలా ఉండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. రైల్వే శాఖ మంత్రి అశ్వీనీవైష్ణవ్ ఇటీవల ఈ రైలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి ఆమోదముద్ర పడటంతో మరిన్ని రైళ్ల తయారీ కూడా ఊపందుకుంది. త్వరలో దేశంలోని ప్రధాన ప్రాంతాల మధ్య ఇవి రాత్రి వేళ పరుగులు పెట్టబోతున్నాయి. 14 రూట్‌లలో వీటినే నడిపే ఆలోచనలో రైల్వే అధికారులు ఉన్నారు.

# కేసీఆర్ కట్టింది గడీలు.. మేం కట్టేది బడులు



'కేసీఆర్ గత పదేళ్లలో విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఏడు లక్షల కోట్లు అప్పు చేశారు కానీ విద్యాలయాలకు పైసా విదల్చలేదు. పైగా ఐదు వేలకుపైగా స్కూళ్లను మూసి వేయించారు. ఒక నియోజకవర్గానికో, ఒక కులానికో గురుకులాన్ని ఏర్పాటు చేసినా వాటిలో కనీస సదుపాయాలు కల్పించలేదు. నలుగురు ఉండాల్సిన గదుల్లో 40 మంది పిల్లలను కుక్కారు. చదువుకున్నోళ్లకు ఎవరైనా ఆయా రంగాల్లో ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలి. కానీ ఆయన మాత్రం తన కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు, కూతురుకు ఎమ్మెల్సీ, మరో కొడుక్కి రాజ్యసభ పదవులు కట్టబెట్టాడు. నమ్ముకున్న పేదలకు మాత్రం గొర్రెలు, బర్రెలు, పందులు పంచి పెట్టాడు.

నీ కొడుకును, అల్లుడిని, బిడ్డను బర్రెలు, గొర్రెలు కాయడానికి పంపుతావా? పేదోడు చదువుకుంటే ఎక్కడ వారిలో చైతన్యం వస్తుందో అని, ఎక్కడ తన తప్పులను ప్రశ్నిస్తారో అని భయపడి చదువుకు దూరం చేసి, వారిని బానిసలుగా చూశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ విడదీసి ఒకేచోట కలిసి మెలసి ఉండాల్సిన పిల్లల మెదడులో విషం నింపాడు. సమాజ విచ్ఛిన్నానికి కుట్రపన్నాడు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా విభజించాడు. ఆయా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను అప్పనంగా కొట్టేసి నిర్మాణాలు చేపట్టాడు. కానీ పేదలకు స్కూళ్లు, ఆస్పత్రులు కట్టేందుకు మాత్రం ఆయనకు మనసు రాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు గుండు సున్నా ఇచ్చారు. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారలేదు..'అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రవీణ్‌కుమార్ కూడా దొరలాగే మాట్లాడుతున్నాడు

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అంటే నాకు గౌరవం ఉంది. అణగారిన కులం నుంచి వచ్చి ఐపీఎస్ అయినందుకు ఆయన్ను మనస్ఫూర్తిగా అభినందించా. బీఎస్పీలో ఉంటారో? బీఆర్ఎస్‌లో ఉంటారో ఆయన ఇష్టం. ఆయన గురుకులాలకు కార్యదర్శిగా పని చేశారు. షాద్‌నగర్ బిడ్డలకు రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మిస్తుంటే అభినందించాల్సింది పోయి అడ్డుపడుతున్నాడు. కేసీఆర్ చెప్పిందే ఆయన మాట్లాడుతున్నాడు. బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత ఆయన కూడా పేదలు బర్రెలు, గొర్రెలు, పందులు కాసుకోవాలని దొరలాగే సూచిస్తున్నాడు..'అని సీఎం ధ్వజమెత్తారు.

**సమీకృత స్కూళ్లకు పీవీ ఆద్యుడు**

'నిర్వీర్యమైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నా. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా ఇప్పటికే 34 వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేశాం. 21 వేల మందికి పదోన్నతులు కల్పించాం. ఇందులో అధికారుల కృషి అభినందనీయం. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు దివంగత ప్రధాని పీవీ నరసింహారావు ఆద్యుడు. ఆయన సర్వేల్, నాగార్జునసాగర్‌లో ఏర్పాటు చేసిన స్కూళ్లలో చదువుకున్న అనేకమంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, డాక్టర్లు, లాయర్లు, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు. ఒకప్పుడు సర్వేల్ స్కూల్లో చదువుకున్న బుర్ర వెంకటేశం ఐఏఎస్ అయ్యారు. మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా ఇదే స్కూల్లో చదువుకున్నారు..'అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రాంమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, కలెక్టర్ శశాంక పాల్గొన్నారు.

**విద్యార్థులందరిదీ ఒక్కటే కులం**

కొందుర్గు: విద్యాభ్యాసం చేస్తున్న బాలబాలికలందరిదీ ఒక్కటే కులమని, అది విద్యార్థి కులమని కొందుర్గు విద్యార్థి మణికంఠ అన్నాడు. సీఎం పాల్గొన్న సభలో అతను మాట్లాడుతూ.. పేదలు, మధ్య తరగతి విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి, కుల, మతాలకతీతంగా విద్యార్థులందరూ ఒకేచోట చదువుకునేందుకు వీలుగా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని అన్నాడు.

# సొంతూళ్లకు నగర ప్రజల ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే నగరంలోని ఆర్టీసీ బస్సులు సైతం ప్రయాణికులు లేకుండా ఖాళీగా తిరుగుతున్నాయి. దసరా పండగ నేపథ్యంలో వరుసగా సెలవులు రావడంతోపాటు నగర జీవులు.. వారి వారి స్వస్థలాలకు పయనమయ్యారు. మరోవైపు నవరాత్రుల్లో ప్రధాన పండగలు దుర్గాష్టమి, నవమి, దశమిలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి. దీంతో బుధవారమే హైదారబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు ప్రజలు పయనమయ్యారు. దాంతో రైళ్లు, బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఇక హైదరాబాద్ నగరం నుంచి వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. అలాగే దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. దీంతో రాజధాని నుంచి జిల్లాలకు వెళ్లే రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఈ క్రమంలో యాదాద్రి జిల్లా చౌటుప్పల్ సమీపంలో ఉన్న పంతంగి టోల్ ప్లాజావద్ద వాహనాలు క్యూకట్టాయి. పండుగ వాహనాలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసి పోయింది. అదేవిధంగా హైదరాబాద్-వరంగల్ రహదారిపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక సర్వీసులను నడిపిస్తున్నాయి. రద్దీకి అనుగుణంగా సర్వీసులను పెంచేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. త్యేక బస్సుల్లో సుమారు మూడు లక్షలకు పైగా ప్రయాణికులు తమ స్వస్థలాలకు క్షేమంగా చేరుకున్నట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపిస్తున్నామంటున్న యంత్రాంగం, 13, 14 తేదీల్లో తిరుగు ప్రయాణానికి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. అయితే మరిన్ని అదనపు సర్వీసులు నడపాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు. పిల్లాపాపలతో ఊరెళ్లాలంటే గంటల కొద్దీ రోడ్లపై నిరీక్షించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఇంకోవైపు విజయవాడ, బెంగళూరు, వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా వద్ద బస్సులు, ప్రైవేట్ వాహనాలు భారీగా బారులు తీరాయి. మరోవైపు రైళ్లలో, ఆర్టీసీ బస్సుల్లో రిజర్వేషన్లు లేకపోవడంతో ప్రయాణికులు.. ప్రైవేట్ బస్ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ బస్ సర్వీస్ ఆపరేటర్లు టికెట్ రేట్లను భారీగా పెంచేశారు. దీంతో తప్పని సరి పరిస్థితుల్లో ప్రయాణికులు.. ప్రైవేట్ బస్సును ఆశ్రయిస్తున్నారు. మరోపైపు దసరా నేపథ్యంలో అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఇవి ఈ నెల 14వ తేదీతో ముగియ నున్నాయి. దాంతో నగరాన్ని విడిచి వెళ్లిన వారంతా మంగళ, బుధవారాల్లో మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణం కానున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలోని రహదారులు మళ్లీ ప్రయాణికులతో కిక్కిరిసి పోనుంది. మరోవైపు పండగ వేళ.. ఇళ్లకు తాళాలు వేసి అంతా ఊర్లకు వెళ్లపోతున్నారు. ఈ నేపథ్యంలో దొంగలు హల్‌చల్ చేసే అవకాశముంది. ఎందుకంటే.. గతేడాది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీగా చోరీ కేసులు ఈ సమయంలోనే నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నగరంలోని మూడు కమిషనరేట్ పరిధిలో పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులోభాగంగా నైట్ పెట్రోలింగ్ పెంచారు. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, వ్యక్తిగత గృహాలపై నిరంతరం నిఘా పెట్టారు. అలాగే గతంలో చోరీల కేసులో అరెస్టయి.. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తుల కదలికలపై సైతం పోలీసులు గమనిస్తున్నారు. ఇక గతేడాది ఏ ప్రాంతాల్లో చోరీలు అధికంగా జరిగాయో గమనించిన పోలీసులు.. ఆయా ప్రదేశాల్లోని ప్రజలు అప్రమత్తం చేశారు. ఆ పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే.. వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. అదే విధంగా ఆ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను సైతం నిరంతరం పర్యవేక్షించేలా పోలీసులు చర్యలు చేపట్టారు.




## అంతిమ విజయం మంచినే వరిస్తుంది: వైఎస్ జగన్

తాడేపల్లి: రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. "లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండగే విజయదశమి. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుంది" అని వైఎస్ జగన్ అన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలి. రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలి. ఆ కనకదుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి" అని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

## తెలంగాణలో సమగ్ర కులగణనపై జీవో జారీ



హైదరాబాద్: తెలంగాణలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. సర్వే బాధ్యత ప్రణాళికశాఖకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది. ఉపకులాల వారీగా ఎస్సీల వెనకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.



# 108 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన

శంకర్పల్లి అక్టోబర్ 11(డైలీ రిపోర్ట్): శంకర్పల్లి మండలం ఎలువర్తి గ్రామంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నాడు గ్రామ పురోహితులు జోషి అక్షయ్ కుమార్ శర్మ గారి ఆధ్వర్యంలో 108 మహిళలు చే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి గ్రామ పురోహితులు మాట్లాడుతూ ప్రతి అణువులో ప్రతి వ్యక్తిలో పరమాత్ముని దర్శించండి భగవంతుని నామస్మరణతోనే జీవితానికి సాఫల్యత లభిస్తుంది అని అన్నారు జగన్మాత యొక్క కృప వల్ల ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో భవానీ మాల స్వాములు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ అదం ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించిన ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్




గిద్దలూరు అక్టోబర్ 11(డైలీ రిపోర్ట్): గిద్దలూరు ప్రజవైద్య శాల కు సూపర్డెంట్ గా పదోన్నతి పొందిన సందర్భంగా డాక్టర్ అదం గారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన గిద్దలూరు మండల టీడీపీ నాయకులు ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్, జయరామిరెడ్డి,మునిస్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## శంకర్పల్లి ఇరిగేషన్ అధికారుల కూల్చివేతలు

**శంకర్పల్లి అక్టోబర్ 11 (డైలీ రిపోర్ట్):** శంకర్పల్లి మండలం పిలిగుండ్ల గ్రామంలో మూసికి దగ్గర ఒక వెంచర్లో అక్రమంగా నిర్మించిన కాంక్రీట్ ప్రహరీ గోడను ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు. మండలంలో ఇరిగేషన్ ఏఈ, ఫీల్డ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కూల్చివేతలు జరిగాయి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

## గిద్దలూరు మండల ప్రజలకు, విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి యూత్ నాయకులు



గిద్దలూరు అక్టోబర్ 12(డైలీ రిపోర్ట్): గిద్దలూర్ మండల ప్రజలకు మండల టీడీపీ యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు.విజయాలకు చిహ్నమైన ఈ విజయదశమి అన్ని రంగాల్లో అందరికి విజయం చేకూరాలని , సుఖ సంతోషాలతో ఆనందంగా విజయ దశమి పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా మండల టిడిపి యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్ ఆకాంక్షించారు....

## ప్రపంచంతో తెలంగాణ బిడ్డలు పోటీపడేలా విద్య

**ఎంత ఖర్చయినా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు**

**రఘునాథపాలెంలో స్కూల్ శంకుస్థాపనలో మంత్రి తుమ్మల**

**ఖమ్మం:** ప్రపంచంతో తెలంగాణ బిడ్డలు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'కు శ్రీకారం చుట్టారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎంత ఖర్చయినా సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో నాణ్యమైన విద్య అందించేందుకు ఈ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు మంత్రి తుమ్మల శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 'ఒక్కో పాఠశాలకు రూ.350కోట్ల వరకూ ఖర్చు చేసి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నాం. మె?దటి విడత కింద నేడు 28 నియోజకవర్గాల్లో రూ.5వేల కోట్లతో పాఠశాలలకు శంకుస్థాపన చేశాం. రఘునాథపాలెం వద్ద అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన స్వామినారాయణ ట్రస్టు స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు స్వామి నారాయణ ట్రస్ట్ స్కూల్ వల్ల మండల ఖ్యాతి పెరుగుతుంది. ఖమ్మం నగరంలో రానున్న రోజుల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేస్తాం అన్నారు.



## దుర్గామాత దర్శించుకున్న భీమ్ భరత్

చేవెళ్ల అక్టోబర్ 11 (డైలీ రిపోర్ట్): చేవెళ్ళ నియోజక వర్గం మొయినాబాద్ , చేవెళ్ళ మండలాల కేంద్రం లో పలు మండపాలలో శ్రీ శ్రీ నవ దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ మరియు వీరితో పాటుగా పాల్గొన్న మొయినాబాద్ జ×, మొయినాబాద్ మండల అధ్యక్షులు మానయ్య , దమర్లపల్లి మాజీ సర్పంచ్ బార్ల యాదయ్య ,చేవెళ్ళ మాజీ సర్పంచ్ శైలజ ఆగి రెడ్డి, %ూూజూ% చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి మరియు పలువురు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## గిద్దలూర్ మండల ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

**"గిద్దలూర్ మండల టీడీపీ నాయకులు**

**ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ**



గిద్దలూరు అక్టోబర్ 11(డైలీ రిపోర్ట్): దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలను పురస్కరించుకుని గిద్దలూర్ మండల ప్రజలందరికీ "గిద్దలూర్ మండల టీడీపీ నాయకులు ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండగే విజయదశమి అని ఆయన అన్నారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందని పేర్కొన్నారు. ఆ దుర్గ మత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనకదుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని " గిద్దలూర్ మండల టీడీపీ నాయకులు ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్ " ఆకాంక్షించారు.



# యాక్షన్ సినిమా చేయాలని ఉంది:కావ్యా థాపర్

“ఓ నటిగా నాకు యాక్షన్, సైకో కిల్లర్, డీ గ్లామరస్.. ఇలా విభిన్న తరహాపాత్రలు చేయాలని ఉంది. అయితే నాకు ఎక్కువగా గ్లామరస్ రోల్స్ వస్తున్నాయి. ‘విశ్వం’లో నాకు మంచి క్యారెక్టర్ దక్కింది” అని అన్నారు హీరోయిన్ కావ్యా థాపర్. గోపీచంద్, కావ్యా థాపర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘విశ్వం’. శ్రీను వైట్ల దర్శకత్వంలో వేణు దోనేపూడి, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో కావ్యా థాపర్ చెప్పిన విశేషాలు. ఈ సినిమాలో నేను కాస్ట్యూమ్ డిజైనర్ రోల్ చేశాను. మోడ్రన్‌గా ఉండే అమ్మాయి. కానీ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్‌లో కాస్త గ్రే షేడ్ కనిపిస్తుంది... ఫన్ కూడా ఉంటుంది. ఈ చిత్రంలో సీనియర్ నరేశ్, పవిత్రగార్లు నా తల్లిదండ్రులు. శ్రీను వైట్లగారు మంచి నటన రాబట్టుకున్నారు. మంచి విజన్ ఉన్న దర్శకుడు. ఈ చిత్రంలోని ట్రైన్ ఎపిసోడ్‌లో నా క్యారెక్టర్‌లో కూడా ఫన్ ఉంటుంది. ఈ సినిమాలో పదిహేను మంది హాస్యనటులు నటించారు. ఆడియన్స్ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తారు. కథలో ఎమోషన్, యాక్షన్ కూడా ఉన్నాయి. ‘విశ్వం’ సినిమాను మల్టిపుల్ లొకేషన్స్‌లో చిత్రీకరించాం. మైనస్ 15 డిగ్రీల వాతావరణంలో సినిమా టీమ్ అందరూపాల్గొన్నాం. విదేశాల్లోనూ షూటింగ్ చేయడం అంటే చిన్న విషయం కాదు. నేను నటించిన ‘ఈగిల్’కి కూడా విశ్వప్రసాద్‌గారే నిర్మాత. ఓ రకంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీని హోమ్ బ్యానర్‌గా భావిస్తుంటాను. ఇక నాకు తెలుగు భాష అర్థం అవుతుంది. ఓ టీచర్‌ను నియమించుకుని తెలుగు నేర్చుకుంటున్నాను. త్వరలో తెలుగులో మాట్లాడతాను. మూడు కొత్త సినిమాలకు సైన్ చేశాను. ఆ వివరాలను త్వరలోనే వెల్లడిస్తాను.


# మొదట్లో బాధపడ్డా.. ఇప్పుడు అలవాటు పడ్డా..

దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ గుర్తింపు సాధించింది అందాలభామ ప్రియమణి. ప్రస్తుతం ఆమె సినిమాలు, సిరీస్, టీవీ ప్రోగ్రామ్స్‌తో బిజీ బిజీగా ఉన్నది. ఈ సందర్భంగా ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడింది. ‘నేను మతాంతర వివాహం చేసుకున్నాను. దాంతో నాపై వచ్చినన్ని ట్రోల్స్ ఎవరి మీదా రాలేదు. నేనేదో దేశద్రోహం చేసినట్టు రెచ్చిపోయి మరీ కామెంట్లు పెట్టేవారు. మనసులు కలవడానికి కులమతాలు అడ్డుకావు. ముస్తాఫా రాజ్ నాకెంతోకాలంగా తెలుసు. మా అభిప్రాయాలు, అభిమతాలు కలిశాయి. పెద్దల అంగీకారం లభించింది. ఎనిమిదేండ్ల క్రితం ఇద్దరం పెళ్లితో ఒకటయ్యాం. ఈ రోజుకు కూడా మా పెళ్లి విషయంలో ట్రోల్స్ వస్తూనే ఉన్నాయంటే నమ్ముతారా!? మొదట్లో ఈ ట్రోల్స్ వల్ల బాధపడేదాన్ని. ఇప్పుడు అలవాటు పడిపోయా.’ అంటూ చెప్పుకొచ్చింది ప్రియమణి. ‘జవాన్’తో గత ఏడాది ప్రేక్షకుల్ని పలకరించింది ప్రియమణి. ఈ ఏడాది ఆమె నటించిన మైదాన్, ఆర్టికల్ 370 చిత్రాలు పెద్దగా ఆడలేదు. ఓటీటీలో విడుదలైన ‘భామాకలాపం 2’కు మాత్రం మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు.



# దేవకీనందనుడి ఆగమనం

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా రూపొందుతోన్న యాక్షన్ ఎంటైర్టైనర్ ‘దేవకీ నందన వాసుదేవ’. అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. నవంబర్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని, టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ కథలో సోల్ చాలా డెప్త్‌గా ఉంటుందని, దర్శకుడు అర్జున్ జంధ్యాల సినిమాను అద్భుతంగా తీశారని, కథానాయిక మానస వారణాసి ఛాలెంజింగ్ రోల్ చేసిందని, కచ్చితంగా హిట్ సినిమా అవుతుందని హీరో అశోక్ గల్లా నమ్మకం వెలిబుచ్చారు. ‘మేం కొత్తవాళ్లమే అయినా మంచి అవుట్‌పుట్‌తో వస్తున్నాం. మా సినిమా రిలీజ్ టైమ్‌లోనే మట్కా, కంగువా సినిమాలు కూడా రిలీజ్ అవుతున్నాయి. అయినా సరే.. మా సినిమా మాదే. కంటెంట్‌ని నమ్మి చేసిన ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. ప్రశాంత్‌వర్మ కథ, సాయిమాధవ్ బుర్రా పదునైన సంభాషణలు, భీమ్స్ సిసిరోలియో ఆకట్టుకునే బాణీలు ఈ సినిమాకు హైలైట్ కానున్నాయి. మా హీరో అశోక్ గల్లాని హీరోగా మరోస్థాయిలో నిలబెట్టే సినిమా ఇది’ అని నిర్మాత బాలకృష్ణ చెప్పారు. కృష్ణుడి నేపథ్యంలో కథ నడుస్తుందని, కథలో చక్కని డివోషనల్ టచ్ ఉంటుందని, ఆరంభం నుంచి ముగింపు వరకూ ప్రతి పాత్రా హైలైట్ అయ్యే సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. ఇంకా కథానాయిక మానస వారణాసి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, రసూల్ ఎల్లోర్, సమర్పణ: నల్లపనేని యామిని, నిర్మాణం: లలితాంబిక ప్రొడక్షన్స్.



# తను వెడ్స్ మను మూడో పార్ట్‌లో ముగ్గురుగా?

కంగనా రనౌత్ కెరీర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన సినిమా ‘తను వెడ్స్ మను’. కథానాయికగా కంగనాకు స్టార్ స్టేటస్‌ని కట్టబెట్టిన సినిమా ఇదే. ఇందులో కంగనా, మాధవన్‌ల నటనను ఎవరూ మరిచిపోలేరు. ఆనంద్ ఎల్.రాయ్ తెరకెక్కించిన ఈ చిత్రానికి నేటికీ ఫ్యాన్స్ ఉన్నారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ‘తను వెడ్స్ మను రిటర్న్స్’ కూడా మంచి హిట్ అయిన విషయం తెలిసిందే. త్వరలో ‘తను వెడ్స్ మను’ మూడో పార్ట్ రానున్నట్లు బీటౌన్‌లో వార్తలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో.. ఆ వార్తలు నిజమేననీ, పార్ట్ 3కి సన్నాహాలు జరుగుతున్నాయని దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ సినిమా విషయంలో ఆసక్తిని రేకెత్తిస్తున్న మరో విషయం ఏంటేంటే.. ఈ మూడో పార్ట్‌లో కంగనా ఏకంగా త్రిపాత్రాభినయం చేస్తున్నదట. మూడు భిన్నమైన పాత్రల్లో ఆమె కనిపించనున్నట్టు బాలీవుడ్ మీడియా కోడై కూస్తున్నది. ఇది కంగనా అభిమానులకు నిజంగా శుభవార్తే.





# అప్పుడో ఇప్పుడో ఎప్పుడో..

నిఖిల్ హీరోగా, సుధీర్‌వర్మ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటైర్టైనర్‌కి ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. ఈ ఏడాది దీపావళి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. నిఖిల్ ట్రెండీ స్టైలిష్‌గా, రుక్మిణీ వసంత్ గ్లామరస్‌గా.. ఇద్దరూ కలిసి నడుస్తూ ఈ లుక్‌లో కనిపిస్తున్నారు. సుధీర్‌వర్మ, నిఖిల్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన స్వామిరారా, కేశవ చిత్రాలను మించేలా ఈ సినిమా ఉంటుందని, కచ్చితంగా వీరిద్దరికీ ఇది హ్యాట్రిక్ హిట్ అవుతుందని నిర్మాత నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంశ కౌశిక్, హర్ష చెముడు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: కార్తీక్, నేపథ్య సంగీతం: సన్నీ.ఎం.ఆర్, సహనిర్మాతలు: యోగేష్ సుధాకర్, సునీల్ షా, రాజా సుబ్రహ్మణ్యం, సమర్పణ: బాపినీడు, నిర్మాణం: ఎస్.వి.సి.సి.ప్రొడక్షన్స్.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707